

# చేదునిజం



విమలారామం

"ఏవమ్మో శారదా!... మీ మాణిక్యం ఏంచేసిందో విన్నావా?"

పరుగు పెట్టినట్టు వచ్చిన వర్ధనమ్మ వైపు ప్రశ్నార్థకంగా చూసింది శారద.

వర్ధనమ్మకి వాళ్ళమీద వీళ్ళమీద చాడీలు చెప్పటమంటే మహాయిష్టం! అక్కడ కబుర్లిక్కడికి యిక్కడి కబుర్లక్కడికి చేరవేయటం వింతో పరదా! విన్నదానికి పదింతలు చేర్చి చెప్పటమంటే మంచినీళ్ళ ప్రాయం.

వివరయినా ఆమె చెప్పిందాన్ని ఖండిస్తే —మరింత రెచ్చిపోతుంది. అందుకనే, ఆమె యేంచెప్పినా ఊకొట్టి ఊర్కోవటం అలవాటు చేసుకుంది శారద.

'మీ మాణిక్యం...' అంటూ మాణిక్యం చేసే పనులన్నిటికీ శారదదే బాధ్యతయినట్టు మాట్లాడుతూంటుంది వర్ధనమ్మ... కారణం, మాణిక్యాన్ని తన దగ్గర మొదట పనిలో పెట్టుకొని తర్వాత నాలుగయిదిళ్ళ వాళ్ళకి పనిలో కుదిర్చి పెట్టినది శారదే! వర్ధనమ్మ ఎలాంటి వ్యంగ్యాలు విసురుతూ వచ్చినా యింతవరకు శారదకి ఏలాంటి మాటా తీసుకురాలేదు మాణిక్యం! 'అందుకనే, మాణిక్యం ఏదో చేసిందని చెప్పటానికి వచ్చిన వర్ధనమ్మ వైపు మొదట ప్రశ్నార్థకంగా చూసినా తర్వాత నిర్లిప్తంగా చూసింది.

ఇన్నాళ్ళు యిలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న దానిలా వ్యంగ్యంగా నవ్వింది వర్ధనమ్మ. "నేను చెప్పేది నమ్మటానికి నువ్వు సిద్ధంగా ఉన్నట్టులేవు కాని ...నిజం ఎంతకాలం దాగుతుంది? ఊరు ఊరంతా కోడయి కూస్తోంది..."

ఈమాటు ఏదో జరగకూడనిది జరిగి వుంటుందని శారదకి అనిపించింది. అప్రయత్నంగా "ఏంజరిగిందండీ?" అని అడిగింది.

"అయితే, నీకింకా తెలియదన్నమాట!..." తెలియదని శారద ముఖం చెపుతున్నా - ఆమెకి తెలియదని తెలిసే తను వచ్చినా - ఊరించి ఊరించి సాగదీసి సాగదీసి నాన్చినాన్చి చెప్పింది. "ఫేన్సీషాపులోంచి ఏదో పట్టుకు పారిపోతోంటే దాన్ని పట్టుకుని జైల్లోకి తోసార్ట!"

శారదకి షాక్ తగిలినట్టయింది.

"పాపం... మాణిక్యం అక్షరాలా మాణిక్యం లాంటిదని నువ్వుచెప్పుకు మురిసి పోతుంటావు కాని..."

శారదకి ఒక్కసారిగా కోపం ముంచుకు వచ్చింది. "... అలాగని మీతో నేనెప్పుడు చెప్పానండీ! అదేమన్నా నాకు తోడబుట్టిన చెల్లెలా, మేనత్త కూతురా?"

ఎప్పుడూ లేనిది శారద ఒక్కసారిగా యిలా ఎదురు తిరిగే సరికి వర్ధనమ్మ గతుక్కుమంది. అయినా, అలవాటు పడిన నోరు యిట్టే స్వాధీనంలోకి తీసుకుంది. "మా మాణిక్యం... మా మాణిక్యం అంటూ చెప్పుకుంటున్నావుగా అందుకని.."

"మా మాణిక్యం అంటే మా యింటి చుట్టమనా!... మా పనిమనిషిని మా అనక మీ అంటానా? మీ పనిమనిషి రంగమ్మని.. మీ రంగమ్మని అంతా అనటం వినటం లేదా?... అలాగే యిదీను."

"నేననేది అందుక్కాదు. అక్కడికేదో మీ మాణిక్యం మహా బుద్ధిమంతురాలయి పోయినట్టు...మా పనిమనుషులంతా ఉత్త దొంగముండ లయి పోయినట్టు కబుర్లు చెప్పేదానివి కదాని..."

"అలాగని నే నెక్కడన్నానండీ? ఏదో మాటలో మాటొచ్చి మా పనిమనిషి మంచిదని అన్నానేమో! అంత మాత్రాన మీ పనిమనుషులంతా దొంగలని నేనన్నట్టవుతుందా?"

"...మాణిక్యం మంచిదంటూ నాలు

ఇళ్లల్లో పనికి కుదిర్చి పెట్టింది నువ్వే కదా!"

"అవును. మంచిది కనుక చేర్పించాను. ఇంతకాలం మా యిళ్లల్లో మంచిగానే పని చేసింది. ఇవేళ దానికేదో పెడబుద్ధి పుట్టి జైలుకి వెడితే దానికి బాధ్యురాల్ని నేనా?..."

"నువ్వు బాధ్యురాలివని నే ననటం లేదమ్మాయ్! ఇప్పటికయినా మాణిక్యం కూడా దొంగముండేనని ఒప్పుకుంటావా లేదాని." ఒప్పుకోనేదాకా అక్కడ్నుంచి కదలను- అన్నట్టు నేలమీద చతికిలబడింది వర్ధనమ్మ.

అప్పటికే విన్న విషయంతో శారద మనస్సు కలగిపోయింది. వర్ధనమ్మ మాటలింకా కలత పెడుతున్నాయి. సరిగ్గా అదే సమయంలో శాంతమ్మ, రాజేశ్వరి వచ్చారు.. "...ఏమిటి శారదా?" అంటూ.

వాళ్ళకి ముందరే చెప్పి వచ్చింది వర్ధనమ్మ. మాణిక్యం ఏఏ యిళ్లల్లో పని చేసేదో వాళ్లనంతా పరామర్శించి ఆనందించాలని ఎన్నాళ్ళనుంచో మహా యిదిగా వుంది వర్ధనమ్మకి కారణం... తను అవసమ్మకంతో వద్దు పొమ్మన్న మాణిక్యాన్ని నమ్మి మొదట పనిలోకి తీసుకున్నది శారద! అంతే కాకుండా నాలుగయిదు యిళ్ళల్లో పని కూడా కుదిర్చింది. అహేం చిత్రమో... ఒక్కళ్ళంటే ఒక్కళ్ళు మాణిక్యం మీద చెడ్డమాట చెప్పకున్న వాళ్ళే 'కరువయి' పోయారు! పైగా మా మాణిక్యం- అంటూ గర్వంగా చెప్పకున్నారు. అందుకే వర్ధనమ్మకి మాణిక్యంమీద... మాణిక్యాన్ని పనిలో పెట్టుకున్న వాళ్ళమీద మహామహా కసిగా వుంది... ఇదిగో యిన్నాళ్ళకో అవకాశం వచ్చింది. అందుకే, అందరిమీద యిలా విరుచుకుపడి వికృతానందం అనుభవిస్తోంది.

"మీ కెంత తెలుసో నాకూ అంతే తెలుసు!" అంది శారద పొడిగా.

"అది కాదు శారదా! మన మాణిక్యం యిలాంటిపని చేసిందంటావా అని" అంది రాజేశ్వరి.

"...మన మాణిక్యం! మన మాణిక్యం! మళ్ళీ వస్తే పనిలో పెట్టుకుంటావేమో కూడా!" అంది వర్ధనమ్మ వ్యంగ్యంగా.

"నువ్వుండవమ్మా! మాణిక్యం గురించి నీకేంతెలుసు?" అంది శాంతమ్మ చిరాకు పడుతూ.

"తెలుస్తోనేవుంది... నీ వళ్ళ కెంత తెల్సో!..." అని చిక చిక నవ్వింది వర్ధనమ్మ.

ఆమె నవ్వుకి శారదకి ఒళ్ళు మండి




పోయింది. "మీకేం తెల్సు ? అది షాపు లోంచి పట్టుకు పోతుంటే మీరక్కడుండి చూసారా ? ఎవరెవరో చెప్పిన మాటలు పట్టుకుని ఒకళ్లననటం మంచిది కాదు..."

"నేను కల్పించి అన్నానంటావా ? అయితే, దాన్ని జైల్లో ఎందుకు పెట్టారు? ...అంతగా నా మాట అనుమాన మయితే— నా రంగమ్మ నడగండి... వెంకట రంగం గారి పెళ్ళాన్నడగండి. శేషాద్రిగారి భార్య నడగండి ... ఈ పేట పేటంతా చెపుతారు !..."

"జైల్లో పెట్టాలంటే ఈరోజుల్లో దొంగతనాలే చెయ్యనక్కర్లేదు. పోలీసు వాళ్లతో పేచీ వచ్చినా—గొప్ప గొప్పవాళ్లతో గొడవ వచ్చినా పేదవాళ్లకి ముందు దొరికేది చావుదెబ్బలు— తర్వాత జైలు !" అంది రాజేశ్వరి.

"నువ్వన్నది నిజం! ఎవరో అన్యాయంగా కేసుపెట్టి మాణిక్యాన్ని జైల్లో పెట్టించి వుంటారు !... ఏమంటావ్ శారదా !" అంది శాంతమ్మ.

"అవునండీ ! మాణిక్యం దొంగతనం చేసిందంటే నేనూ నమ్మలేను. మాయింట్లో దాదాపు యేడాది పని చేసింది...ఏదిపట్టుకు పోవాలన్నా దానికి కష్టంకాదు. అయినా, ఏదీ పొరపాటున కూడా ముట్టుకొని యెరుగదు."

"... మీ రెంత దాచుకున్నా నాకూ తెల్సులే !" అంది వర్ధనమ్మ చేతులు త్రిప్పుకుంటూ.

"ఏమిటండీ మేందాచుకున్నదీ మీకు

# చేదు నిజం

తెల్సిందీను ?" అంది రాజేశ్వరి తనూ చేతులు త్రిప్పుతూ.

"నాల్గు రోజుల్నుంచి మీ యింట్లో నాంచారి, శాంతమ్మింట్లో అప్పలమ్మా పన్లోకి వస్తున్నారు. ఈ శారదమ్మ సీతని పన్లోకి పెట్టుకుంది ... ఒక్కసారిగా మాణిక్యం మీ యిళ్లల్లో పనెందుకు మానేసింది ?... మీ యిళ్ళల్లో ఏదో దొబ్బుకు పోబట్టే కదా అంతా గప్‌చిప్‌గా దాన్ని మాన్పించేసారు ?..."

"ఓహోహో ఎంత గొప్ప నిజం తెల్సుకున్నారు వర్ధనమ్మగారూ ! ఈ వార్త యిప్పటి కెన్నిళ్లల్లో చెప్పివచ్చారు ?" అంది శాంతమ్మ వ్యంగ్యంగా నవ్వుతూ.

"ఆవిడకి అభాండాలు వేయటం అలవాటే కదా !" అంది రాజేశ్వరి పెదవి విరుస్తూ.

వర్ధనమ్మ వైపు నిరసనగా చూపింది శారద. "ఎందుకు పని మానేసావని మాణిక్యాన్నడిగినా, మాణిక్యం ఎందుకు పని మానేసిందని మాలో ఎవర్నడిగినా మీకు వెంటనే నిజం తెల్సిపోయేది కదండీ !"

"ఒక పనిమనిషి ముందకి వకల్తా పుచ్చుకొని మీరంతా నా మీద విరుచుకు పడుతున్నారు— ఏమిటమ్మా యింతో ఓసి నిజం!..." అంది వర్ధనమ్మ గొంతు చించుకుంటూ.

"మీ కళ్లెదుట కనిపిస్తున్నదేనండీ..!" అంది రాజేశ్వరి గట్టిగా.

"అంటే, నాకు కళ్ళు కనపడ్డంలేదంటావా! కొంచెం మాటలు జాగ్రత్తగా రానివ్వు రాజేశ్వరమ్మా!..."

వర్ధనమ్మ నోరు గట్టు తెగిన యేరు కావటం యిష్టంలేక సమయానికి శారద ఆనకట్ట వేసింది. "మిమ్మల్ని కించపరచాలని మా ఉద్దేశ్యం కాదండీ! జరిగింది చెపుతున్నాము. మాణిక్యం కడుపుతోవుంది. ఎంత పని మనిషయినా అదీ మన తోటి ఆడదేకదా! తొమ్మిదోనెల వచ్చినా యింకా చాకిరీ చేస్తుంటే చూస్తూ ఎలా వుండగలం? ఒకటి రెండు నెలలు మే మెలాగో తంటాలు పడతాం... సుఖంగా పురుడోసుకురావే పిచ్చిదానా అని చెపితేకాని పని మానింది కాదు. అలాగని తన స్థానాన తను పోయిందా? నాంచారిని, సీతని, వాళ్లనీ వీళ్లనీ బతిమాలి తను వచ్చేదాకా మా యిళ్లల్లో పనిచేయమనిచెప్పి మరీ వెళింది. అలాంటి మంచి మనిషిని గురించి చెడుగా అనుకోవటం మనకేమన్నా భావ్యమేనా? మీరే చెప్పండి..."

అప్పటికీ వర్ధనమ్మ ఓటమి సంగీకరించలేదు. "సరే, మాణిక్యం మహా పుణ్యాత్మురాలు!... మరయితే షాపులో దొంగతనమాటేమిటి?"


"అదే మా కర్థం కావటంలేదు" అంది శారద తనలో తను అనుకున్నట్టు.

"నా కర్థమయింది. నేను చెపుతాను వినండి... అది ఏడాది నుంచి మీ యిళ్లల్లో పనిచేస్తూ మంచిదాని క్రింద చెలామణి అయింది (?). ఒక్కసారిగా మిమ్మల్నందర్నీ మోసంచేసింది. పురిటి కెడుతున్నానని వంక పెట్టి అక్కడ యిక్కడ దొంగతనాలు చేసి చేతికి చిక్కింది పట్టుకు పారిపోతోంది. దొరికింది చాలక షాప్సీషాపులో కూడ ఘోరానికి ఒడిగట్టింది. అక్కడ కర్మకాలి దొరికిపోయింది. ఎందుకయినా మంచిది మీ యిళ్లల్లో ఏవేం పోయాయో—యిప్పుడయినా చూసుకోండి"

"మీకా భయం లేదు... మా యిళ్లల్లో ఏవీ పోలేదు!" అంది రాజేశ్వరి.

"మీ ఆయన లాయరు కదా! ఆ చేతా యీచేతా సంపాదిస్తున్నాడు. నీకు పోయినా లెక్కేమిటిలే !"

చీదరించుకుని లేచిపోయారు రాజేశ్వరి, శాంతమ్మాను... మరి కొంతసేపు అదే



యూకాన్
పేలుచుండ్రు నివారిణి.
అన్నిషాపులలోదొరకును
మాన్‌ఫార్మా, విజయవాడ - 2.

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!
హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లస్వప్నము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును.
వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ చేయబడును.
డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి: 28, వార్న్ బోగ్ రోడ్, మద్రాసు-17.





# చెదు నిజం

తరహాలో వాగివాగి వర్ధనమ్మ కూడా వెళ్ళిపోయింది.

కాని, ఆమె చెప్పిన విషయాలతో మనసు చెదిరిపోయింది శారదకు! మాణిక్యం దొంగతనం చేసిందా?

అసంభవం! మాణిక్యం నిప్పులాంటి మనిషి. నిజాయితీకి మారు పేరు. ఆ విషయం శారదకు తెల్సినంత బాగా మరెవ్వరికీ తెలియదు.

"...నువ్వెవరో నాకుతెలియదు. తెలియని వాళ్ళని పనిలో పెట్టుకోవటం ఎలా?" అని శారద మొదటి రోజున అన్న మాటకు "పొట్ట సేత పట్టుకుని వొచ్చినామమ్మా! ఈ వూల్లో అందర్కి నాను క్రొత్తే!... ఎవరో వొకరు నమ్మి పనియ్యకపోతే నాను బతికే దెట్టాగమ్మా!... మీ ముఖంచూస్తే మంచి మనసున్న తల్లి వనిపిత్తున్నాది. అందుక్కే నోరు తెరిసి అడిగినాను. తమ దయ..." అంది మాణిక్యం.

ఆ మాటలకి మనస్సు కరిగి పని యిచ్చింది శారద... అయినా, మాణిక్యాన్ని ఓ కంట కనిపెడుతూనే వచ్చింది. చెప్పిన పని శుభ్రంగా, నీటుగాచేసే మాణిక్యం త్వరలోనే ఆమె మనస్సు నాకట్టుకుంది. అయితే అవకాశం వస్తే మాణిక్యం ఏం చేస్తుందో అన్న అనుమానం ఆమెను పట్టి వదల్లేదు. అందుకనే, ఒకసారి పనికట్టుకుని పదిరూపాయల నోటు భర్త చొక్కాజేబులో పెట్టి ఉతకటానికి వేసింది. కాని ఐదు నిమిషాలయినా కాకుండా "... తమరు సూడ్లేదనుకుంటాను" అంటూ నవ్వి ఆ నోటు తెచ్చిచ్చింది మాణిక్యం. మరోసారి ముందే లెక్కపెట్టుకుని చిల్లరనోట్లు కొన్ని కనిపించేలా మంచంమీద పడేసింది శారద. ఇల్లు తుడవటానికి గదిలోపలికి వెళ్ళిన మాణిక్యం మరుక్షణంలో బయటికి పరుగెత్తివచ్చి శారదని పిల్చుకొని వెళ్ళి "...చూసారా అయ్యగారెలా డబ్బు పడేసి వెళ్ళిపోయారో! తమరేనా సూస్కోపోతే ఎట్టాగమ్మా!" అంది. అటువంటి మంచి మనిషిని అంతకాలం అనుమానించి నందుకు నొచ్చుకుంది శారద.

ఆ తర్వాత అనేక సార్లు బజార్నించి ఆసామానూ ఈసామానూ తెచ్చి పెట్టింది

మాణిక్యం. ఏప్పుడూ డబ్బు కాజేయలేదు సరికదా— తను తెచ్చుకునే దానికంటే చవగ్గా సరుకులు తెచ్చిపెట్టింది... ఆరా తీస్తే "గొప్పింటోళ్ళని సూత్తే ధరలలాగే సెపుతారమ్మా! ఇక మేమున్నామా— సగానికి సగం అడిగేత్తాం... అల్లు తిట్టుకున్నా పర్లేదు..." అని నవ్వింది మాణిక్యం.

"ఈ పనిమనుషులంతా దొంగముండలే! అవకాశం రావాలేకాని... అందినకాడికి బొక్కటానికి ఎవళ్ళూ వెనుదీయరు" అని వర్ధనమ్మే కాదు అనేకమంది అనటం వింది శారద. కాని, శారద ఎన్నో అవకాశాలు కల్పించింది. కాని, ఒక్కసారంటే ఒక్కసారి మాణిక్యం తప్పటడుగు వేయలేదు. అయితే, కేవలం మాణిక్యం మాత్రమే అసాధారణమైన మనిషా? అంత పేదరికంలో కూడ ఇంత నిగ్రహంతో ఎలా వుండగలుగుతోంది?

ఉండబట్టలేక ఒక రోజున మాణిక్యాన్నే అడిగేసింది శారద. మాణిక్యం మొదట తెల్లబోయింది. "...నా వొక్కసారి కూడ దొంగతనం సెయ్యలేదని చిత్రంగుందమ్మా! అసలు నా నెందుకు దొంగతనం సెయ్యాల? అడిగిన జీతమిత్తున్నారు. అడక్కుండానే అదీయిదీ తింటానికి పెడతన్నారు. ఈ సీర సానా బావుంది. జాగత్తగా కట్టుకోండి పాతపడిపోయాక నాకే యియ్యాలమ్మగోరూ అని నాను పరాసికానికంటే— నాల్నెల్లు తిరక్కుండా కటుకోమని యిచ్చేసినారే! మీ కొడుక్కి బిస్కత్తు పెడితే—నా కొడుక్కి పెట్టకుండా వుండరే! మమ్మల్నింత బాగా సూత్తారే... మీ యింటో దొంగతనం సేత్తానా అమ్మ!... అలాంటి యెదవ పన్జేస్తే నాకు పుట్టగతులుంటయ్యా! పురుగులు పడి సచ్చిపోనా?..." అంది కన్నీళ్ళు పెట్టుకుంటూ.

అయ్యో, ఒక మంచి మనిషిని నొప్పించానే అని ఆవేళ ఎంతో బాధపడింది శారద. ఆ తర్వాత... తన మంచితనం తాను ఋజువు చేసుకుంటూ నాలుగయిదిళ్ళల్లో మాణిక్యాన్ని పనికి కుదిర్చింది. ఎవళ్ళు చూసినా సుఖపడ్డామన్న వాళ్ళేకాని ... తప్పులెన్నేవాళ్ళు లేకపోయారు.

కాని, అర్ధాంతరంగా ఈ దుర్వార్త యేమిటి?...వర్ధనమ్మ చేరవేసిన కబురు నిజమేనని, ఆ సాయంత్రమే తెల్సిపోయింది శారదకి.

ఆఫీసు నుంచివస్తూనే భార్యముఖం చూసి "ఏమిటలా వున్నావు?" అని అడిగాడు కృష్ణారావు.

విన్నది వివరంగా చెప్పింది ఆమె.

"ఛ! మాణిక్యం దొంగతనం చేసిందా? ...ఎవళ్ళో దాని మీదకి అన్యాయంగా నేరం తోసేసుంటారు!"

శారదకి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. "అవునండీ! నా మనసులోని మాటే మీరూ చెప్పారు...అసలేం జరిగిందో మనం తట మనమే తెల్సుకుందాం. అవసరమయితే దానికి సాయం చేద్దాం."

కృష్ణారావు తెల్లబోయాడు. "అంటే, జైలుకివెళ్ళి కల్సుకుందామనా?"

"అవునండీ! తప్పేముంది? ఒకమంచి మనిషికి అన్యాయం జరిగిందని తెల్సికూడా మనం నిమ్మకి నీరెత్తినట్టుండ గలమా?... మీరే చెప్పండి."

"సరే, ముందు దానిమొగుణ్ని కల్సుకొని ఏంజరిగిందో తెల్సుకుంటే?..."

"అలాగే, మీరెలా అంటే అలా! ... ఇప్పుడే వెడదాము!"

"నీకు వాళ్ళుండే చోటు తెలుసా మరి!" అని నవ్వుతూ అడిగాడు కృష్ణారావు.

"ఫలానా యిల్లని తెలియదు కాని ... వాళ్ళ గుడిసెలుండే చోటు తెల్సు. ఓసారి బజార్నించి వస్తుంటే మాణిక్యం చెప్పింది..."

వాళ్ళిద్దరూ మురికిపేట చేరుకునేసరికి కనుచీకటి పడుతోంది. చుట్టూ తొవ్వి గుంటలు, అడుగు పెట్టటానికి అసహ్యంగా ఉంది.

"ఛ! ఇలాంటి చోటా వాళ్ళుండేది!" అన్నాడు కృష్ణారావు బాధగా.

"అవును. వాళ్ళేకాదు ... మనమెక్కిన రిక్షా తొక్కినవాడు, మనకి కూరలమ్మే ముసలమ్మ... వీళ్ళంతా వుండేది యిక్కడే! ఎంతోమంది యిక్కడే బతుకుతున్నారు" అంది శారద ఉద్వేగ పూరిత స్వరంతో.

ఎవర్నో "వెంకటస్వామి ఉండేదెక్కడ?" అని అడిగాడు కృష్ణారావు.


ఒకరేమిటి— ఆ చుట్టుపట్ల పలుగురయిదుగురు వెంకటస్వామిలున్నారు. కాని, జైలుకి వెళ్ళిన మాణిక్యం మొగుడు వెంకటస్వామి ఎక్కడుంటాడో యిట్టే తెల్సిపోయింది.

వాళ్ళను చూస్తూనే వెంకటస్వామి ఆశ్చర్యపోయాడు. "దణ్ణాలు బాబూ! తమరు ... తమరంత దూరం నుంచి వచ్చారా?"

వాడు నమస్కారం చెయ్యటానికి వీల్లేకుండా చేతికట్టు అడ్డు వచ్చింది.

"నీ చేతికేమయింది?" అని ఆత్రంగా అడిగింది శారద.

వెంకటస్వామి ఏదో గోడౌన్‌లో కూలిపని చేస్తున్నాడు. బరువయిన బస్తా దొర్లి మీదపడి చెయ్యి విరిగిపోయింది. తప్పు వాడిదేనని తమకేం బాధ్యత లేదని తప్పించు



ధర్మపథం

# పుత్రులలోని మూడువిధాలు

తమ తమ యోగ్యతలను బట్టి, అయోగ్యతలనుబట్టి పురుషులలో ఉత్తములు, మధ్యములు, అధములు అనే వ్యత్యాసం ఉన్నట్లు చాలామందికి తెలుసును. ఆ విధంగానే పుత్రులలో కూడా వ్యత్యాసాన్ని చూడవచ్చును.

ఈ పుత్రులలో ఉండే భేదాలను వివరిస్తూ ఉన్న ఒక పెద్దల సూక్తి ఉన్నది — అది —

"ఆత్మనా జ్ఞాయతే ధన్యః
మధ్యమః పితృ పితామహైః,
మాతృ పక్షేణ మాత్రేణ
ఖ్యాతి మేతి నరాధమః"

ఇతరుల గౌరవ మర్యాదలపైని ఆధార పడకుండా స్వయంగా కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన కుమారుడు ధన్యుడు అతడు ఉత్తముడు. అలా కాకుండా తండ్రి తాతల కీర్తి ప్రతిష్ఠలపైని, పలుకుబడిపైని ఆధారపడి ప్రజలవల్ల మర్యాదలు పొందేవాడు మధ్యముడు. తనలో ఏవిధా చేవలేక పోయినా తల్లి చేతను, మాతృవంశీయుల చేతను పొగడ్త పొంది తగు మనిషిగా చెలామణి అవుతున్నవాడు అధముడు — అని ఈ శ్లోకానికి అభిప్రాయం.

తన కుమారుడు యోగ్యుడయినా, అయోగ్యుడయినా, తల్లికి వానియందు అభిమానం ఎక్కువ. "కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి". ఆమె యెప్పుడూ వాని మేలుకే ప్రయత్నిస్తుంది. అందువల లేని గుణాలను కూడా ఆరోపించి పొగడుతుంది. అందువల్ల, తనలో యోగ్యత లేక పోయినా పుత్రుడు తల్లి మూలంగా నలుగురిలోనూ పేరు తెచ్చుకుంటాడు. తల్లి వంకవారూ కూడా అలాగే భావిస్తారు వారి మూలంగా ప్రసిద్ధికి వచ్చినవాడు అధముడు మాత్రమే అవుతాడు.

తండ్రి, తాతలు విద్యావిషయంగా గాని, ధనం వల్లగాని రాజకీయంగా గాని సుప్రసిద్ధులై ఉన్నప్పుడు, కుమారుడు, వారి పేరు చెప్పుకొని గౌరవ మర్యాదలు సంపాదించవచ్చు. తండ్రి తాతలతో కలిసి వెళ్ళినా — తాను ఒంటరిగా ఎక్కడికి పోయినా ప్రజలు గౌరవిస్తారు. కుమారుని యోగ్యతా యోగ్యతలతో నిమిత్తం లేదు. ఇలా పేరు తెచ్చుకున్న వాళ్ళు మధ్యముల్లోకి లెక్కకు వస్తారు.

ఇతరుల పైని ఆధార పడకుండా స్వప్రయత్నం వల్ల కీర్తి ప్రతిష్ఠలు, గౌరవ మర్యాదలు సంపాదించాలంటే పుత్రుడిలో యోగ్యత ఉండాలి. విద్యలోనూ, ప్రవర్తనలోనూ, పరోపకారంలోనూ, ఇతర విధాలనూ యోగ్యుడనిపించుకోవాలి. అట్టివానికి తండ్రి, తాతలను బట్టి కాకుండా — స్వతంత్రంగా — కోరకుండానే గౌరవం లభిస్తుంది. అతడు ఉత్తముడు. అతడే ధన్యుడు. అతడే కాదు — అతనివల్ల తండ్రి కూడా ధన్యుడు కాగలడు.

— బులుసు వెంకటరమణయ్య

# చేదు నిజం

కున్నారు గొడౌన్ ఓనర్సు. గవర్నమెంటు హాస్పటలుకి వెడితే మూడు రోజులు పడిగాపులు పడినా కట్టుకట్టిన పాపాన పోయారు కాదు ఆ ఫణ్ణాత్ములు. మొగుడి బాధ చూడలేక...కూలిపని చేసుకునే వాడికి చెయ్యే ఆధారమని — ఆ చేతి నెలాగయినా కాపాడుకోవాలని...రంగారావు గారి హాస్పటలుకి తీసుకుపోయి కట్టు కట్టించింది మాణిక్యం!

"...ఏదో పురిటి కెడుతోంది కందా! కొత్త తిండి తింటుందని నాల్గురూపాయి లెక్క విచ్చారు తమరు. ఆ యమ్మాయి యిచ్చినదంతా నా రోగానికే సరిపోయిందమ్మా!" అన్నాడు వెంకటస్వామి దిగులుగా.

"అదిసరే, మాణిక్యం ఏది? ఎక్కడికి వెళ్ళింది?" అని అడిగింది శారద

"మాణిక్య మండి ... మా వూరు ... మా వూరెళ్ళిందండి!" అన్నాడు వాడు తల దించుకుంటూ.

"నువ్వు చెప్పకపోయినా మాకూ కొంత నిజం తెల్సిందోయ్! జరిగింది తెలిస్తే సాయం చేద్దామనే వచ్చాముకాని...మిమ్మల్ని తిడదామని కాదు." అన్నాడు కృష్ణారావు.

వెంకటస్వామి వెంటనే జవాబు చెప్పక పోయేసరికి "ఊరంతా మాణిక్యం జైలుకి వెళ్ళిందని చెప్పుకుంటున్నారు. నిజమేనా?" అని అసహనంగా ఆవేశంతో అడిగింది శారద.

"నిజమే నండమ్మా! కాని,..."

"అది దొంగతనం చెయ్యలేదు. ఆ సంగతి నాకు బాగా తెల్సు. కాని, ఆ నేరం దాని మీదకి ఎవరు తోసారు? అసలా షాపుకి ఎందుకు వెళ్ళింది? వున్నది వున్నట్టు నిజంచెప్పు..."

వెంకటస్వామి మాట్లాడలేదు.

"చూడు వెంకటస్వామీ! అవసరమయితే లాయర్ని పెట్టించి కేసు గెలిపించేలా చేస్తామేకాని ... మాణిక్యానికి అన్యాయం మాత్రం జరగనివ్వం. నువ్వుమాత్రం నిజం దాచకుండా చెప్పు" అంది శారద.

"కేసంటే మాటలా అమ్మగోరూ! అంతడబ్బు నాకెక్కడుంది-ఓమూల ఒంటి సెయ్యి. కూలి సెయ్యలేను. నా తిండి నాకే దొరకటంలేదు..."

"అంత మాత్రాన దాని కర్మాన దాన్ని జైల్లో వదిలేస్తావా? అప్పు చేసయినాసరే కేసు నడిపించాలి!"

వెంకటస్వామి నవ్వులో జీవంలేదు. "అప్పు! మాలాటోళ్ళకి అప్పులిచ్చే వాళ్ళెవరుంటారు అమ్మగోరూ!..."

"నే నిస్తానోయ్! ఎంత కావాలో చెప్పు..." అన్నాడు కృష్ణారావు ఉద్రేకంగా.

"తమరు మంచోరు బాబూ! కనుకనే యిందూరం వొచ్చి యింత యిదిగా మాటాడుతున్నారు. కాని, ఎంతడబ్బవుద్దో ఏమో! అప్పు తీర్చటం మాటలు కాదుగా! ఒక్క తప్పొప్పుకుంటే రెండు మూడు నెలేత్తారు. ఆ తర్వాత అదే బయటి కొచ్చేత్తది..."

"చెయ్యని తప్పు అసలది ఎందుకొప్పుకోవాలి?" అని అడిగింది శారద కోపంగా.

"...ఇంక తమరికాడ అబద్ధం సెప్పి నాబంనేదు. నిజమే సెప్పేత్తానమ్మగోరూ!"

"చెప్పు!"

"మాణిక్యం దొంగతనం చేసినమాట నిజమే! కాని, వస్తువుకోసంకాదు జైలుకి వెళ్ళాలని!"

శారదా కృష్ణారావులు తెల్లబోయారు. "జైలు కెళ్ళాలనా?"

తల వూపాడు వెంకటస్వామి.

మొదటికాన్పు మరో వూళ్లో గవర్నమెంటు హాస్పటల్లో పోసుకుంది మాణిక్యం. కాని, అక్కడెవరూ పట్టించుకున్నవాళ్లు లేకపోయారు. పుట్టిన పిల్లాడికి ఏదో జబ్బుచేసి చచ్చిపోయాడు... రెండో కాన్పుకి అసలు హాస్పిటల్లో ఖాళీలేదు పొమ్మన్నారు. ఆ గుడిసెలోనే ఎలాగో బిడ్డని కన్నది. కాని పురిటి రోజుల్లో వర్షాలు, వరదల్లో వాళ్ళకి బ్రతకటమే కష్టమైపోయింది. ఏదో ఆయువు వుండబట్టి పిల్లాడు బ్రతికాడు. ఇప్పుడిది మూడో కాన్పు. మళ్లీ వర్షాలు


# 58 ఏళ్ళు నిండాక మీరు ఏ మాత్రమూ పని చేయనప్పుడు, మీరు ఇంకా సంపాదించుకుంటూ వుండవచ్చు




మీరు వయసులో వుండి, పనిచేస్తున్నప్పుడే ఉద్యోగ విరమణ తర్వాత ఏమిచేయాలో ఆలోచించాలి.

అందుకు ఇండియన్ బ్యాంక్ వద్ద సరియయిన పథకం వుంది — రిటైర్‌మెంట్ ప్లాన్ అకౌంట్.

అకౌంట్‌లో ప్రతినెలా 10 సంవత్సరాల పాటు మూడు రూపాయలు వేస్తే 10 సంవత్సరాల పాటు ప్రతినెలా మీకు చెప్పుకోదగ్గ మొత్తం రూ. 239.50 జీతంలా లభిస్తుంది. ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థికంగా మీరు స్వతంత్రంగా వుండడానికి ఇది చాలినంత మొత్తం.

మీరు డిపాజిట్ కాలపరిమితిని మీకు తగిన విధంగా మార్చుకోవచ్చు — 12 నెలల నుంచి 120 నెలల వరకూ. డిపాజిట్ కాలపరిమితికి తగినట్లు తిరిగి చెల్లించే ఏర్పాట్లతో. మంచి వడ్డీ కూడా చేరి.

దీని గురించి ఆలోచించండి — సాధ్యమయినంత త్వరలో అకౌంట్ ప్రారంభించండి. చీకుచింతాలేని ఉద్యోగ విరమణానంతర జీవితం దీనిమీద ఆధారపడి వుండవచ్చు.

మీ సమీపంలోని ఇండియన్ బ్యాంక్ బ్రాంచిలో పూర్తి వివరాలు లభిస్తాయి.

**ఇండియన్ బ్యాంక్**

**మీ సుఖసమృద్ధికి సహకారి**

**రిటైర్‌మెంట్ ప్లాన్**

**సైకో - సెక్సో - థెరాపి**

సంతానమునకు, గర్భనిరోధమునకు, సుఖ వ్యాధులు, బహిష్టు వ్యాధుల నివారణకు, వక్షోజ సౌందర్యంకొరకు, బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం, అంగం చిన్నదైనచో, నరముల బలహీనత పోగొట్టి వీర్యవృద్ధికి, వృద్ధాప్యములో యవ్వనశక్తి పొందుటకు, ధాతు పుష్టికి, ఇంకా అనేక అంతరంగిక సమస్యల పరిష్కారమునకు సంప్రదించండి.

డా॥ వై.వి.యస్. మోహనరావు,
దుర్గగుడి టర్నింగ్, బ్రాహ్మణ వీధి,
విజయవాడ—520001.



**WHEN NATURE FAILS**

New మరింతవిత్తు, పొడుగు కాగలరు
H Super 2 మంది 8 అం. వరకు పూర్తి.
eight (For Super Heightness)
మీరూ పొడుగు పెరగదలచుకుంటే ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మా హైటెక్స్ HYTEX ఔషధాన్ని వాడండి. వయోపరిమితిలేదు. స్త్రీలు, పురుషులు కూడా పుచ్చుకోవచ్చు. HYTEX is a great name and meant for popular people. 1 Phail (20 T A. B. S., Rs. 7.50 advance By M.O. 3 Phails(60 Tabs) Rs. 15/- money order by advance.

M/S. VICTORIA COMMERCIAL COY,
Beat No. 1, Ambala Cantt-133001 (N.I.)
Correspond in English (AMW/12/78)



చలిముడత వేసికిందా?



**బాధ నివారణ కోసం**
**అయొడెక్స్**
**రుద్దటం అవసరం**

ఇతర ఆయింట్‌మెంట్స్ మీకు బాధనుంచి ఉపశాంతిని యియ్యవచ్చు. అయొడెక్స్ ఉపశాంతిని యిస్తూ, బాధను నివారిస్తుంది. దీనిలో అయొడిన్ ఉంది గనక.

కండరాల నొప్పులకూ, కీళ్ళ నొప్పులకూ ఒకే ఒక ఆయింట్‌మెంట్-అయొడెక్స్.






అయొడెక్స్-మిమ్మల్ని మళ్ళీ చురుకుగా పనిచేసేలా చేస్తుంది.

లింటాస్-IODEX.3-75 TL


# చేదు నిజం

రోజులు. గవర్నమెంటు హాస్పిటల్లో చేర్చుకుంటారో లేదో నమ్మకం లేదు. ఒకవేళ చేర్చుకున్నా 'ఎలా ఆదరిస్తారో' ఇదివరకే ఒకసారి 'రుచి' చూసింది.

ఏ వూళ్ళో అయినా గవర్నమెంటు హాస్పటలు పద్ధతి ఒక్కటే అని చెప్పటానికి కాబోలు వారం క్రితం వెంకటస్వామి విషయంలో ప్రాణాల మీదకి తెచ్చినంత పని చేసారు!

తన తిండి తనే సంపాదించుకోలేని స్థితిలో వున్నాడు అతను ఇంక భార్యా బిడ్డల్ని ఎలా పోషిస్తాడు? పురుడెలా వెడుతుంది?

"...మా సోమయ్య పెళ్ళాం జైల్లోనే పురుడోసుకుంది అమ్మగోరూ! దానికి రెండు పూటలా తిండి పెట్టేవారంట. వోరం వోరం వచ్చి డాక్టరుబాబు సూసేవోడంట..."

శారదకి కడుపులో ఏవరో దేవినట్లయింది

పూరిగుడిసెలో రక్షణ లేదు. గవర్నమెంటు హాస్పటల్లో వైద్య సదుపాయం దొరకదు... కనీసం సంపాదించి తిండి పెట్టే మొగుడికి చెయ్యి స్వాధీనంలో లేదు. ఇంత కాలం పనికి పెట్టుకున్నవాళ్ళు అతనికర్మకి అతన్ని వదిలేసారు. ఈ పరిస్థితుల్లో మాణిక్యం ఏం చేస్తుంది?

"జైల్లో తిండేనా పెడతారమ్మగోరూ! అందుకనే, ఇదొరకు సోమయ్య పెళ్ళాం పుర్టిరోజుల్లో జైలు కెళ్ళింది. ఈడకన్న ఆడనే మెరుగని సెప్పింది... నిజం అమ్మగోరూ..."

దేశంలో జైళ్ళలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని పత్రికల్లో వ్రాస్తున్నారు. కాని, బయట పరిస్థితుల కన్న జైళ్ళే నయమని చెపుతున్నారట చూసి వచ్చినవాళ్ళు!

ఇంకా వెంకటస్వామి మాటలు వింటూ అక్కడ నిలబడ గలిగే శక్తి లేక పోయింది శారదకు. "...వెళ్ళిపోదాం పదండి!" అని భర్త చెయ్యి పట్టుకుని లాగింది.

ఆమె చేతులు వణకటం, ఆమె గొంతు గాద్గదికమవటం గుర్తించి ఆమె బాధ నర్థంచేసుకున్నాడుకృష్ణారావు. చటుక్కున జేబులో చెయ్యి పెట్టి చేతికి వచ్చిన నోట్లనో వెంకటస్వామి చేతుల్లో కూరి... గబగబా ఆమె వెంట అడుగులు వేసాడు!